క్లుప్తంగా

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు అందజేస్తున్న బిషప్ మహంతి

గాజువాక: స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లను మంగళవారం పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మహంతి మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా కుట్టు మిషన్లు ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. అంతే కాకుండా పేదలు నివసించే ప్రాంతాల్లో మంచినీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నామని, మెడికల్ శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

విద్యా కానుక అందజేత



పుస్తకాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

గాజువాక: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కానుక పథకం కింద మంజూరైన పుస్తకాలు, యూనిఫారంలను గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొంటూ మంచి ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు జరిపారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సంతతోటలో మేలుజాతి ఆవులు

మూగరోదన!

అందుబాటులోలేని పశువుల ఆస్పత్రి

అవస్థలు పడుతున్న పశుపోషకులు



పశువులకు వైద్యం చేస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం: పశువైద్యశాల అందుబాటులో లేకపోవడంతో వడ్లపూడి ప్రాంతంలోమూగజీవాల సంరక్షకులు అవస్థలు అడుతున్నారు. అత్యధికంగా పాడి పశువులు, ఇతర జంతువులు ఉన్న ప్రాంతాలుగా కూర్మన్నపాలెం,వడ్లపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు గుర్తింపు సాధించాయి. ఈ ప్రాంతంలో పశువులకు ఎటువంటి అనారోగ్యం ఏర్పడినా దూరా భారమైన అగనంపూడి ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ కూడా తగిన సదుపాయాలు, మందులు లేకపోవడంతో జంతు ప్రేమికులు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడంలేదు.

సకాలంలో అందని వైద్యం

ఈ ప్రాంత వాసులు వివిధ రకాల జాతుల పశువులను పెంచుతున్నారు. వాటిలో ఎక్కువ శాతం పాలు ఇచ్చేవే ఉన్నాయి. వాటి ద్వారా వచ్చే ఆదాయం పైనే అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వాతావరణలో ఎటువంటి మార్పులు జరిగినా పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయి. ఈ సమయంలో తక్షణమే ఆస్పత్రికి తరలించక పోవడంతో ప్రాణాలు పోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

మందుల కొరత

పశువులకు వ్యాధులు సోకినప్పుడు దూరాభారమైనా అగంపూడి ఆస్పత్రికి తీసుకెళ్తే మందులు లభించడం లేదని వాపోతున్నారు. వారు సూచించిన మందులు గాజువాక, గోపాలపట్నం ప్రాంతంలో కొనుగోలు చేయాల్సి వస్తుందని వారు చెబుతున్నరు. పలు మందులు అసలు అందుబాటులో ఉండడం లేదని వాపోతున్నారు. అధిక ధరలకు బయట కొనుగోలుచేసి పశువుల అరోగ్యం కాపాడుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. అందువల్ల వడ్లపూడి ప్రాంతంలో పశువుల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని పశుపోషకులు కోరుతున్నారు.

నిలిచిన ప్రతిపాదనలు

వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ ప్రాంతంలో పశువుల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతం వాసులు విజ్ఞప్తులు అందించారు. అందుకు స్పందించిన పాలకులు వడ్లపూడి ప్రాంతలో స్థలం అందుబాటులో ఉంటే ఆస్పత్రి నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే మీ సేవా కేంద్రానికి పక్కనే ఒక స్థలాన్ని ఎంపిక చేసి అందులో ఆస్పత్రి నిర్మించాలని ప్రతిపాదించారు. ఇంతలో ప్రభుత్వం మారిపోవడంతో ఆ ప్రతిపాదన గాల్లో కలిసిపోయింది. దీంతో మళ్లీ ఇక్కడి వాసులకు అగనంపూడి ఆస్పత్రే దిక్కు అవుతోంది.

6 వేల మూగ జీవాలు

వడ్లపూడి ప్రాంతంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం అన్ని రకాల జంతువులు కలిపి 6000 వేలకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంత భారీ సంఖ్యలో పశువులు ఉన్నా ఆస్పత్రి కోసం కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. పాడిపశువులకు ఎక్కువగా పొదుగు వాపు, గాలికుంటు,డెక్కజడుపు, కాలిష్యం తగ్గడం వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయి. ఈ ప్రాంతలో ఒంగోలు, ముర్రాజాతిగేదెలు, ఆవులు, జెరిస్సీ,సాయివర,గిరి,నాటుఆవులు, తార్‌పాక పశువులు అధికంగా ఉన్నాయి. వాటికి తరచూ కాలుష్యం తక్కువ అయి వ్యాధుల బారిన పడినప్పుడు వైద్యం అందించడానికి అవస్థలు పడుతున్నామని పాడి రైతులు వాపోతున్నారు. జాతి ఆవులు ఒక్కొక్కటి రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల వరకూ ఉంటాయని వారు చెబుతున్నారు.



వడ్లపూడిలో పెంచుతున్న గేదెలు

దూరాభారం



మాకు పశువుల ఆస్పత్రి అందుబాటులో లేదు. మందులు కూడా దొరకడంలేదు. ఆవులు, గేదెలు అనారోగ్యానికి గురరైతే పడరాని పాట్లు పడుతున్నాం. ఒక్కో జాతి ఆవుకు అనారోగ్యం సోకితే అర గంటలోనే ఆస్పత్రికి తరలించక పోతే చనిపోయే ప్రమాదం ఉంది. అటువంటి అప్పుడు మేము అష్ట కష్టాలు పడాల్సివస్తుంది. చివరకు అగనంపూడి ఆస్పత్రికి వెళ్లినా అక్కడ మందులు ఉండడం లేదు. బయట కొనుగోలు చేస్తున్నాం

–మళ్ల సూరిబాబు, పాల వ్యాపారి, సంతతోట,వడ్లపూడి

వైద్యం అందక రెండు ఆవులు మృత్యువాత



ఆస్పత్రి అందుబాటులోలేక నాకు చెందిన రెండు ఆవులు చనిపోయాయి. ఇటు గాజువాక గాని అటు అగనంపూడి వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడాల్సిందే. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పడ ఆస్పత్రి నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగాయి. ప్రభుత్వ మారిన తర్వాత ఆ సంగతే మరిచిపోయారు.

–దుగ్గపు దానప్పలు, కణితికాలనీ

వైద్యం అంతంత మాత్రమే



ఆవులు, గేదెలతోపాటు మేకల, గొర్రెలకు తగిన వైద్య సౌకర్యం లేదు. ముఖ్యంగా మేకలకు, గొర్రెలకు పొక్కుల వ్యాధులు తరచూ సంభవిస్తున్నాయి. వాటి నుంచి ఉపశమనం కలగాలి అంటే అధిక మొత్తంలో వ్యయం చేయాల్సి వస్తుంది.గతంలో సంచార వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు నిలిపి వేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. వడ్లపూడిలో ఆస్పత్రి ఉంటే పశువులు. గొర్రెలు పెంచే మాకు కొంత సౌకర్యంగా ఉంటుంది.

– దేవర చిన్నారావు, వడ్లపూడి

వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుల నియామకం

గాజువాక: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ గాజువాక నియోజకవర్గంలోని పలు వార్డులకు అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. 72, 86, 87, 88 వార్డులు మినహా మిగిలిన అన్ని వార్డులకు అధ్యక్షులను నియమించారు.

వార్డు	అధ్యక్షుడు
64	ధర్మాల శ్రీనివాసరావు
65	మద్దాల అప్పారావు
66	పెదిరెడ్ల ఈశ్వరరావు
67	పల్లా సురేష్ యాదవ్
68	సంద్ర నూకరాజు
69	బోగాది సన్యాసిరావు (సన్నీ)
70	కొణతాల రాము
71	భూపతిరాజు శ్రీనివాసరాజు
73	షౌకత్ అలీ
74	తిప్పల ఎమిలీ జ్వాల
75	గొందేశి శ్రీనివాసరెడ్డి (బుజ్జి)
76	మంత్రి శంకరనారాయణ
78	రావాడ శివ
79	మహాలక్ష్మి నాయుడు
85	గున్నంటి పూర్ణానంద శర్మ

స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం



రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఉక్కునగరం: కేవీపీఎస్ స్టీల్ డివిజన్, ఏపీ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఎస్టీఎం విభాగం జీఎం ఎస్.రమణారావు, జనరల్ ఫోర్‌మెన్ కె. బాలశౌరిలను సత్కరించారు. గత నెలాఖరున పదవీ విరమణ చేసిన సందర్భంగా స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వారికి శాలువాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం సమాజంలో ఉన్న అసమానతలను తొలగించడానికి, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పని చేయాలని కోరారు. సన్మానగ్రహీతలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ తమకు ఎంతో మంచి భవిష్యత్తు ఇచ్చిందని, ప్లాంట్ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్ సుందరం, కేవీపీఎస్ అధ్యక్షుడు ప్రకాశ్ వరకుమార్, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. చిరంజీవి, వై.టి. దాస్, బి. తాడన్న, కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ విమల తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాఖ విద్య: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని సెంట్రల్ పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు పి. గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం మంగళవారం ఎన్‌ఏడీలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. సమావేశానికి హాజరైన గోపాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్స్‌కు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలన్నారు. వీటికి వ్యతిరేకంగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మెకు అంతా సిద్ధంగా ఉండాలన్నారు. కనీస పెన్షన్ అమలు చేయాలనే డిమాండ్ ఉన్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

పానీ పూరీ.. యమ క్రేజీ..



వుడా కాలనీలో పానీ పూరీ బండి వద్ద సందడి

పెదగంట్యాడ: మండలంలో ఎక్కడ పడితే అక్కడ పానీ పూరీ బండ్లు, వెలిశాయి. ఫాస్ట్‌ఫుడ్ ఆరోగ్యానికి హానికరమని వైద్యులు హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. పానీ పూరీ, బేల్‌పూరీ, మసాల పూరీ పై ఎక్కువ చూపుతున్నారు. ఈ బండ్లు, దుకాణాల వద్ద సాయంత్రం అయితే చాలు విపరీతమైన రద్దీ ఉంటోంది. పానీపూరీ బండి ఎక్కడ ఉంటే అక్కడకు కుటుంబాలతో సహా వెళ్లి తినేవారి సంఖ్య పెరుగుతోంది. మండలంలో సందుకొకటి చొప్పున వీటిని ఏర్పాటు చేవారు.

మండలంలో 100 పైగా దుకాణాలు

ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వారు ఎక్కువ మంది ఈ పానీపూరీ బండ్లు ఏర్పాటు చేస్తున్నారు. పార్కులు, వుడాకాలనీ రోడ్ల పక్కన , నడుపూరు, సీతానగరం, గోపాలరెడ్డినగర్, ఇస్లాంపేట, మదీనాబాగ్, పెదగంట్యాడ, హౌసింగ్‌బోర్డు కాలనీ ఇలా మండలంలో ప్రతి చోట ఈ దుకాణాలు దర్శనమిస్తున్నాయి. దాదాపు 100 పైగా దుకాణాలు ఉంటాయి. చిన్న అనుభవం ఉన్న వారు కూడా వారు దుకాణాలు ఏర్పాటు చేసి జీవనోపాధి పొందుతున్నారు.

యోగాంధ్రను జయప్రదం చేయాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

గాజువాక: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న విశాఖలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలని తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ కోరారు. కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొననున్నారని, అందువల్ల ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా భావించాలని కోరారు. విశాఖలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం ప్రపంచ రికార్డు నెలకొల్పనుందన్నారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, రాజాన రామారావు, రౌతు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణలో సింహగిరి వర్తకులు, మారుతీ భక్తమండలి బృందం

సింహాచలం: చందనోత్సవం రోజు సింహగిరిపై గోడ కూలి శివైక్యం చెందిన భక్తుల పవిత్ర ఆత్మలకు శాంతి కలగాలని సింహగిరి వర్తక సంఘం ఆధ్వర్యంలో 51 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం జరిగింది. మెట్లమార్గాన్ని ఆనుకునే షాపింగ్ కాంప్లెక్స్ ఉండటంతో వర్తకులంతా జరిగిన సంఘటనను ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారు. దీంతో వారి ఆత్మలకు శాంతి చేకూరాలని వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గ కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మారుతీ భక్తమండలి బృందం 51 సార్లు హనుమాన్ చాలీసాని పఠించారు. ఈ సందర్భంగా ముగ్గ కిరణ్ మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ ఎగువన గోడ కూలి భక్తులు మృతిచెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రాజు, వర్తకులు దొంతల శంకర్, నమ్మి శివ, చంద్రరావు, ఎస్.శివ, కె.సుజాత, శ్యామ్, అశోక్, పండూరి రమేష్ పాల్గొన్నారు.

వరాహాల స్వైర విహారం



చినగడుపూరు ప్రధనా రహదారిలో చెత్తను చిందర వందర చేస్తున్న పందులు

- రోగాలు వస్తాయని భయం
- ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆందోళన



వుడా కాలనీ ప్రధాన కాలువలో పందులు

పెదగంట్యాడ: మండలంలోని పలు ప్రాంతాల్లో మళ్లీ పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వీధులను అపరిశుభ్రం చేస్తున్నాయి. రోడ్లపై చెత్తా చెదారాన్ని చెల్లా చెదరు చేయడంతో వ్యాధులతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల పై విచ్చలవిడిగా తిరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపై స్వైర విహారం చేయడంతో వాహనచోదకులు వాటిని ఢీకొట్టి గాయాలపాలవుతున్నారు. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకుని పందుల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఔషధాలకన్నా యోగా మిన్న



మాట్లాడుతున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా



ఆస్పత్రి ఆవరణలో యోగా సాధన చేస్తున్న స్థానికులు, సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

అగనంపూడి: ఔషధాల కన్నా మిన్న యోగ సాధన అనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గ్రహించాలని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. ఉషా అన్నారు. యోగాంధ్రాను పురస్కరించుకొని మంగళవారం అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆవరణలో అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగాలు, అనారోగ్యానికి కారణం మానసిక, శారీరక ఒత్తిళ్లే కారణమన్నారు. వీటిని అధిగమించడానికి యోగ సాధన అవసరమనే విషయం ఇప్పుడిప్పుడే ప్రపంచ నలుమూలలా విస్తరిస్తుందన్నారు. మౌంట్ అబూ నుంచి విచ్చేసిన రాజయోగి బీకే దిల్‌రాజు భాయిజీ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు భారతదేశం పుట్టినిల్లుగా ప్రపంచదేశాల్లో వర్ధిల్లుతుందన్నారు.185 దేశాల్లో బ్రహ్మకుమారీస్ సంస్థ ద్వారా కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు గోపీకృష్ణ, ప్రథమ, నర్సింగ్ సూపరింటెండెట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, విశాఖజిల్లా బ్రహ్మకుమారీస్ సంస్థ ఇన్‌చార్జి బీకే సోమేశ్వరి అక్కయ్య, అగనంపూడి బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జి బీకే రామకోటి తదితరులు పాల్గొన్నారు.

- 88వ వార్డు కాపుజగ్గరాజుపేటలోని మహిళా విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో యోగా గురువులు గండే సూర్యకుమారి, ఎం.మనోజ్ కుమార్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ఖండించండి

పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో వామపక్ష పార్టీల పిలుపు



ర్యాలీలో పాల్గొన్న వామపక్ష నాయకులు

బీచ్‌రోడ్డు: పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ప్రజలు ఖండించాలని, పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు ఆర్టీసీ కాంప్లెక్స్ దరి గురజాడ విగ్రహం దగ్గర నుంచి ఆశీలమెట్ట మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు యుద్ధం వద్దు.. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ఊచకోతలను ఖండించండని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను తీవ్రంగా ఖండించారు. 20 మాసాలకు పైగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని గుర్తు చేశారు. వీరిలో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని తెలిపారు. ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేశారన్నారు. అంతర్జాతీయ జలాల్లో ఫ్రీడమ్ ఫోటిల్లాకు చెందిన మాడ్‌లీన్ ఓడపై ఇజ్రాయెల్ జరిపిన దాడిని కూడా వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. అదుపులోకి తీసుకున్న అంతర్జాతీయ వలంటీర్లందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో సామ్రాజ్యవాద మనుగడ కోసం అమెరికా అనేక దేశాల మధ్య యుద్ధాలు సృష్టించి ముందుకు సాగాలనుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు. పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ మారణకాండకు వ్యతిరేకంగా ప్రజలు నిలబడాలన్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలపై చర్చ



పూర్వ విద్యార్థుల సమావేశంలో వీసీ ఆచార్య రాజశేఖర్ తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వ విద్యాలయం శతాబ్ది సంవత్సర వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం మంగళవారం ఏయూలో జరిగింది. ఈ సమావేశంలో ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్. ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్. కిషోర్ హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎం. రావు, బీవీఎన్. రావు వర్చువల్‌గా హాజరయ్యారు. వారు సంఘం భవిష్యత్తు దృక్పథం, కార్యకలాపాలపై వివరణాత్మక వివరణ ఇచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి బీలా సత్యనారాయణ, ఏఏఏ మాజీ చైర్మన్ గంటా శ్రీనివాసరావు, శంకర్ సమావేశంలో పాల్గొని విలువైన సలహాలు ఇచ్చారు. వర్క్‌షాప్‌లో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం దార్శనికత, లక్ష్యం, విలువలను అధికారికంగా రూపొందించారు. పూర్వ విద్యార్థుల సంఘం కొత్తగా పునరుద్ధరించిన వెబ్‌సైట్‌ను అధికారికంగా ప్రారంభించారు. డిసెంబర్ 2025లో జరగనున్న వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశం ప్రణాళిక అమలుపై కూడా చర్చించారు.